## ప్రకృతి, పరమాత్మల కలయికకు సంకేతమే సంక్రాంతి పండుగ

దినకరుడు శాంతుడై తోచె
దినములింక కురచనయ్యె
చలిగాలి చురుకు హెచ్చె
  పొలములన్ రేయి గ్రుడ్డి వెన్నెలలోన
కుప్పలన్ నూర్చు కాపులు గొంతులెత్తి
  పదములన్ పాడదొడగిరి
పచ్చపూలు జనపచేలకు
  ముత్యాల సరులుగూర్చె
మిరప పండ్లకు కుంకుమ మెరుపుదాల్చె
  బంతిపువ్వుల మొగములల్లంత విప్పి
మన గృహంబుల ధాన్యసంపదలు నిల్పి
  సరసురాలైన పుష్యమాసంబునందు
పరగనొప్పుచు సంక్రాంతి పండుగొచ్చె.

దివ్యాత్మ స్వరూపులారా!

**మారవలసినది మనసుగాని, మనిషి కాదు**

లోకములో దివ్యత్వమును గురించి అనేకమంది ప్రబోధ, ప్రచారములు సల్పుతూనే వున్నారు. ప్రాచీనకాలమునుండి భారతదేశమందు యిట్టి పవిత్రమైన ఆధ్యాత్మిక తత్త్వము ప్రబోధిస్తూ ప్రచారము సల్పుతూ వచ్చుచున్నప్పటికిని మానవునియొక్క మనస్సు యేమాత్రము ఉన్నతస్థాయికి చేరుకొనటంలేదు. మారవలసినది మనసుగానీ మనిషికాదు. మారవలసినది గుణము కాని గుడ్డలుకాదు. 'యద్దృశ్యం తన్నశ్యం'. బాహ్య సంబంధమైన జగత్తునందు సమస్తముకూడను మారుతునే వున్నవి. మారునది అనిత్యము, మారనిది

sri sathyasai vachanamrutam

సత్యము. మారునట్టి భౌతికమైన, లౌకికమైన, ప్రాకృత సంబంధవిషయములందు మనము అమితమైన అభిమాన, అనురాగ, మమకారములు పెంచుకొని, తద్వారా మారని దివ్యతత్త్వమునకు అత్యంత దూరమవుతున్నాము. అట్టి నిత్యసత్యమైన ఆత్మ తత్త్వమునకు సమీపులయ్యే ప్రయత్నమునకు తగిన కృషి చెయ్యాలి. సంవత్సరమునకు 12 సంక్రమణములు జరుగుతున్నవి. సూర్యుడు ఒక్కొక్క నెల ఒక్కొక్క రాశిలో ప్రవేశిస్తున్నాడు. ఒక్కొక్క రాశిలో సూర్యుడు ప్రవేశించిప్పుడంతా ఒక్కొక్క సంక్రమణమవుతున్నది. క్రాంతి అనగా మార్పు. సంక్రాంతి అనగా పవిత్రమైన మార్పు. కానీ, మిగిలిన 11 నెలలను యీ సంక్రాంతి అంత వైభవంగా, విశిష్టంగా ప్రబోధించటంలేదు. ఈ మకరసంక్రమణమునకు మాత్రమే యింత ప్రాధాన్యత, యింత విశిష్టత యిచ్చుటలో వుండిన విశేషమేమిటి?

**సమస్త కర్మలకు కర్మాధికారి, కర్మనిష్ఠుడు, కర్మాచరుడు ఒక్క సూర్యుడే!**

ఈ సంక్రమణము కేవలము అన్ని సంక్రమణములవలె బాహ్యమైన ఆనందమునందించునదే కాకుండా అంతర్ సంబంధమైన ఆనందమునుకూడను చేకూర్చుతూ వచ్చుచున్నది. ఇది మార్గశిర, పుష్యమాసముల మధ్యభాగములో ప్రవేశిస్తుంది. భగవద్గీతయందు శ్రీకృష్ణపరమాత్ముడు 'మాసములలో నేను మార్గశిర మాసమును' అన్నాడు. సమస్తమాసములకు శిరస్సువంటిది మార్గశిరము. కారణమేమనగా సూర్యుడు సమస్త ప్రపంచమునకు ప్రత్యక్షదైవము. సూర్యుడే లేకున్న సృష్టి, స్థితి, లయములే శూన్యము. ఈ మార్గశిరమాసమునందు మానవునకు అత్యవసరమైన ఆహార సదుపాయములు సమకూర్చి మానవునికి విశ్రాంతిని, ప్రశాంతిని అందిస్తున్నది. ప్రతి రైతు యింట పుష్కలంగా ధాన్యము నిల్చి వుంటుంది. ప్రకృతి, వాతావరణము ప్రశాంతముగా వుంటుంది. మానవుడు శాంతిని, ప్రశాంతిని అందుకొనుటకు యిది సరియైన సమయము. ఎట్టి భౌతికమైన పనులు లేకుండా చల్లని గాలిలో చక్కని ఆహారమును భుజిస్తూ మానవుడు కృషి సంబంధమైన పనులు లేకుండా తన పశువులను చూచుకుంటూ తన కుటుంబమును అభివృద్ధిపరచుకుంటూ కాలమును సద్వినియోగము చేసుకుంటాడు. ఐతే,

sri sathyasai vachanamrutam

మానవత్వములో వుండిన దివ్యత్వానికి, యీ భౌతిక శక్తులకు మధ్య వుండిన సంబంధ బాంధవ్యమును కొంతవరకు గుర్తించాలి. మానవుడు అందమును చూచి ఆనందిస్తాడు. ఆహారమును చూచి అనేక విధములుగా వుప్పొంగిపోతాడు. ఇట్టి పరిస్థితులలో మానవుడు ఆనందించే ఆనందముగానీ, ఆహారముగానీ, అందముగానీ బాహ్య ప్రపంచమునకు సంబంధించినదా లేక అంతఃసంబంధమైన ఆత్మకు సంబంధించినదా? ఆనందించునది దేహముకాదు. ఆత్మయే! పరిమళమును చూచి పరితపించేది లేక పరవశమయ్యేది దేహము కాదు. యిదియు ఆత్మయే! కంటితో చూచునది, చెవులతో వినునది, మనస్సుకు హాయి అనిపించునది, హృదయాన్ని మురిపించునది అన్నీకూడను ఆత్మతత్త్వమే! యీ యింద్రియములు కేవలము నిమిత్తమాత్రమైన పనిముట్లు. ప్రతి ఒక్కటి అంతర్భావమునుండియే ఆవిర్భవిస్తున్నది. యిట్టి సత్యాన్ని మనము గుర్తించినప్పుడే మన దివ్యత్వము అర్థము చేసుకొనుటకు కొంతవరకు సాధ్యమవుతుంది. ఈ సమస్త కర్మలకు కర్మాధికారి, కర్మనిష్ఠుడు, కర్మాచరుడు ఒక్క సూర్యుడే!

**మానవునకు ప్రధానమైన సూత్రము నమ్మకము**

నిర్విరామ కృషిచే, నిరంతర తాపత్రయముతో అంతులేని ఆశలతో అర్థముకాని ఆవేదనతో ప్రాకులాడి మానవులకు మరింత ప్రశాంతిని కల్గించి మార్గదర్శకుడుగా నిల్చి కర్మశూరుడుగా ప్రబోధిస్తూ వచ్చేవాడు సూర్యుడు. సూర్యునకు యేమాత్రము విశ్రాంతి లేదు. యితను దూషణ భూషణ తిరస్కారములకు యేమాత్రము లొంగేవాడు కాదు. లోకము దూషించినా కృంగడు. లోకము పూజించినా పొంగడు. కృంగిపొంగనటువంటి దివ్యత్వముతో యేమాత్రము మార్పులేకుండా సమరసమైన భావముతో, పరమశాంతితో తన కర్తవ్యమును నిర్వర్తిస్తూ వుంటాడు. ప్రపంచమునకు తాను చేయునదంతా ఉపకారమేగానీ అపకారముకాదు. నిజానికి మానవునకు ఉపకారము, అపకారములను చేయునవి తనయొక్క యింద్రియములే! యింద్రియములే మానవునకు శత్రువులుగా మారిపోతున్నాయి. యింద్రియములను లొంగదీసుకున్న అవియే మిత్రులుగాకూడా అవుతున్నాయి. మిత్రులు, శత్రువులు అనే భావన మానవ మనోదౌర్బల్యమే! కొద్ది

srisathyasaivahini

నిముషములకు పూర్వము ఒక విద్యార్థి చెప్పాడు. నమ్మిన విభీషణునకు రాముడు దైవముగా రూపొందాడు. నమ్మని రావణునికి శత్రువుగా మారాడు. కనుక, మానవునియొక్క నమ్మక, అపనమ్మకములే తనకు ఆనందము లేక దుఃఖమును అందిస్తున్నవి. మానవునికి ప్రధానమైన సూత్రము నమ్మకము. 'నమ్మి జీవించు' అన్నారు, పెద్దలు. నమ్మకమే లేక దేనిని మనము ప్రేమించలేము. ఈమె నా తల్లి అనే నమ్మకము అభివృద్ధి అయినప్పుడే ఆమెను నీవు ప్రేమించటానికి పూనుకుంటావు. ఇతను నా బిడ్డ అని విశ్వసించినప్పుడే అతనిని నీవు ప్రేమిస్తావు. దైవత్వము నమ్మకమునుంచే ఆవిర్భవిస్తున్నాది.

**Where there is Faith, there is Love**
**Where there is Love, there is Peace**
**Where there is Peace, there is Truth**
**Where there is Truth, there is Bliss**
**Where there is Bliss, there is GOD.**

యీ నమ్మకమనేది దైవత్వానికి చేరుకునేందుకు తగిన ప్రబోధలు సలుపుతూ వస్తున్నాది. కానీ, యీనాటి ప్రబోధలన్నీకూడను కేవలము బాహ్యమైన, ఆడంబరమైన పలుకులవలె రూపొందుతున్నాయి.

## సర్వకర్మలు భగవత్ప్రీత్యర్థముగావించి నీ కర్తవ్యమును నీవు నిర్వర్తించు

దివ్యత్వాన్ని గురించి ఎన్నియో విధములుగా ప్రబోధలు చేస్తారు. కానీ, ఆ ప్రబోధలు సలిపేవారియందు దైవచిహ్నములైన సత్యముకాని, ప్రేమకాని, శాంతికాని యేమాత్రము కనుపించదు. వేషభాషలు, ఆకారములను బట్టి పెద్దలని, పండితులని మనము భావిస్తున్నామేగానీ నిజముగా మానసిక పరివర్తన ఎవరియందు కలదో వాడే నిజమైన పెద్ద. వాడే నిజమైన పండితుడు. భగవంతుని దృష్టి అంతయు మానసిక మార్పుపై ఆధారపడివున్నది. భగవంతుడు మనో పవిత్రతను మాత్రమే చూస్తాడుగాని, మనిషియొక్క శక్తి సామర్థ్యములనుగానీ లేక పదవులనుగానీ యేమాత్రము చూడదు.

### వాల్మీకి ఎవ్వని వంశమందలివాడు?

srisathyasai vachanamrutam

నందుడు ఏ పల్లెయందు పుట్టె?
ధర కుచేలుడెంత ధనవంతుడైయుండె?
గజరాజు ఏ విద్య గలిగియుండె?
వసుధ ధ్రువుండెంత వయసు కలిగియుండె?
శబరికినెంతటి శక్తియుండె?
విదురునకెంతటి వితరణమతియుండె?
తిమ్మనికెంతటి తెలివియుండె?
భక్తి కలిగినవారికి వశుడగునయ్య
ఇంతకన్నను వేరెద్ది ఎరుకపరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

మీరందరు కుల, మత, ఆస్తి, ధన, కనక, వస్తు, వాహనాదులందు ఎంత గొప్పవారైనా, చిన్నవారైనాగానీ భగవంతుడు చూచునది కేవలం ఒక్క భక్తిని మాత్రమే! భక్తి అనగా ఏమిటి? పవిత్రమైన ప్రేమను పరమాత్మవైపు మరల్చటమే భక్తి. అనిత్యము, అశాశ్వతము అయిన యీ జగత్తునందు, వస్తువాహనాదులందు, వ్యక్తులయందు విశ్వాసం బలపర్చుకోటంచేత మనం అభిమాన, మమకారములనే త్రాళ్లచేత కట్టుబడిపోతున్నాం. నీ కర్తవ్యమును నీవు నిర్వర్తించవలసినదే! అట్టని నీ సంసారమునుగానీ, ఆలుబిడ్డలనుగానీ, ఆస్తిపాస్తులనుగానీ విసర్జించి పోనక్కరలేదు. సర్వకర్మలు భగవత్ప్రీత్యర్థము గావించి నీ కర్తవ్యమును నీవు నిర్వర్తించు. అయితే మనస్సును మాత్రము ప్రశాంతమైన స్థితిలో వుంచుకో! ఈ మార్పులు, కూర్పులు బాహ్య సంబంధమునకు చేరినవేగానీ అంతర్భావమునకు యేమాత్రము సంబంధించినవి కాదు. మనస్సుయందు సద్భావములు, సచ్చింతలు మనము అభివృద్ధిపరచుకోవాలి.

మీకందరికి తెలుసు, బైబిల్‌లో ఒక చక్కని సందేశమందిస్తూ వచ్చాడు, జీసస్. ఏదో పాపము చేసినదని ఒక వనితను బజారునందు పెట్టి అందరు రాళ్లు రువ్వుతూ వచ్చారు. ఈ దృశ్యాన్ని జీసస్ చూశాడు. వారికి అడ్డు తగిలి 'ప్రజలారా! ఏదో బాహ్యముగా ఆచరించిన

sri sathyasaivachanamrutam

దోషమును పాపమని భావించి ఆమెను మీరు యింత హింసిస్తున్నారు. యిట్టి పాపమునే మానసికంగా ఎన్నిసార్లు మీరు చేస్తున్నారు? మానసికంగా యిట్టి పాపములను తలంచని వారెవరో వారు మాత్రమే వచ్చి ఆమెను కొట్టటానికి అధికారి అవుతారు. మిగిలినవారు యీమెను హింసించటానికి యేమాత్రము అధికారులు కారు' అన్నాడు. కనుక, యీనాడు మనము 'వీడు పాపి, వీడు పుణ్యుడు' అని కేవలము విచారిస్తున్నామే గానీ, ఎవరు పాపి ఎవరు పుణ్యుడని మనకు మనం విచారించుకోటం అత్యవసరము. మనసులోపల ఎట్టి దుర్భావములు ఆవిర్భవించకుండా చూచుకోటానికి తగిన కృషి చేయాలి. అట్టి పవిత్రమైన మార్పును చేకూర్చునదే యీ సంక్రాంతి.

**ఉన్నత గుణమును ఇతరులకు అందించటమే ఈశ్వరత్వము**

పూర్వము ద్వాపరయుగమునందు కృష్ణుని సన్నిధిని, పెన్నిధిని అనుభవిస్తూ మైమరచి తమ జీవితముయొక్క ఆరాధనా దైవముగా విశ్వసించి, ఎన్నో విధములైన ఆనందములను అనుభవిస్తూ వచ్చారు, గోపి గోపాలురు. ఆనాడు వారు పవిత్రమైన గోవుయొక్క పేడను ఆధారంగా తీసుకొని తమ మానసిక పరివర్తనను కొంతవరకు మార్చుకుంటూ వచ్చారు. ఈ పవిత్రమైన సంక్రాతికి తగిన అంతర్భావమునుకూడను వారు ప్రబోధిస్తూ వచ్చారు. మూడు పేడముద్దలను ఒక చోట పెట్టి దానిపైన మూడు గుమ్మడిపువ్వులు వుంచి వారు అనేక విధములుగా కృష్ణుని ఆడుతూ పాడుతూ ప్రార్థిస్తూ వుండేవారు. ఈ మూడు పేడముద్దలయొక్క అంతరార్థము ఏమిటి? పేడముద్దనగా మనము హీనముగా భావిస్తాము. అది గోపికల దృష్టిలో చాలా పవిత్రమైనది. మన యింటిముందు పేడనీరు చల్లుతూ వుంటాము. దీనివలన మనకు ఆరోగ్యము చేకూరుతుంది. కొన్ని విషక్రిములు ఆ పేడనీటివల్ల మరణిస్తాయి. మనము పీల్చుకునే గాలిలో క్రిములను నాశనముగావిస్తాయి. ఆరోగ్యమునకు, ఆనందమునకు పేడను ప్రధానచిహ్నముగా భావిస్తూ వచ్చారు, ఆనాటి ప్రజలు. అట్టి ఆనందమును, ఆరోగ్యమును యిచ్చేవాడు కృష్ణుడు. ఆయన జ్ఞాపకచిహ్నముగా ఒక ముద్ద. కృష్ణుడు తనయొక్క శక్తిసామర్థ్యములను జగత్వ్యాప్తి గావించటానికి గోవర్ధన గిరిని ఎత్తి, తాను మానవుడుకాదు మాధవుడు, నరుడుకాదు

srisathyasaivachanamrutam

నారాయణుడు అనే తత్త్వాన్ని ప్రబోధించే నిమిత్తం ఎత్తిన గోవర్ధనగిరికి చిహ్నం ఒక ముద్ద. మనకు నిత్యఅనుకూలములు, ఆరోగ్యము, ఆనందములను, ఆహారాన్ని చేకూర్చేవి గోవులు. మానవులకు గోవులు సంతుష్టిని, పుష్టిని చేకూరుస్తూ వస్తున్నవి. కనుక, గోవులకు ఒక ముద్ద. గోపాల, గోవర్ధన, గోవు-యీ మూడింటియొక్క గుకారతత్వమును వారు విశ్వసించి యిదియే మన ఆరాధ్యదైవమని విశ్వసించారు. ఇంక ఆహారములోపల కూరగాయలలో పెద్దస్వరూపము గలది గుమ్మడికాయ. ఉన్నతస్థాయిలో వున్నటువంటిది గుమ్మడికాయ. ఉన్నత భావములనే మనము ఇతరులకు అందించాలిగానీ స్వల్ప భావములుకాదు, అని గోపికలు దీనిని చక్కగా ఆదర్శముగా నిరూపిస్తూ వచ్చారు. గుమ్మడికాయలను యితరులకు దానము చెయ్యాలి, సంక్రాంతిదినమునాడు. దీనివల్ల మనకు కలిగే ఫలితమేమిటి? స్వల్పకాలములో చెడేదికాదు, గుమ్మడికాయ. అధికకాలము నిలువ వుంటుంది. దీనిని ఎన్ని రకములైన కూరలుగానైనా మనము వండుకోవచ్చును. అన్ని కూరలందు యిది సమత్వంగా అంతర్వాహినిగా వుంటుంది. కనుక, ఉత్తమమైన, ఉన్నతమైన యీ ఫలమును యితరులకు అందించాలి; అనగా, ఉన్నత గుణాన్ని యితరులకు అందించాలి. దానినే ఈశ్వరత్వంగాకూడను వారు విశ్వసిస్తూ వచ్చారు.

**భగవంతుడొక్కడే శాశ్వతమైన స్నేహితుడు**

ఈశ్వరుని శిరస్సుపైన చంద్రుడు వుంటున్నాడు. ఈ చంద్రుడు ప్రకాశమును ప్రపంచానికి అందిస్తూంటాడు. దైవము స్వార్థరహితుడు అనే దానికి చిహ్నంగా దీనిని నిరూపిస్తూ వచ్చారు. ఈశ్వరునియందు ఏ ఒక్కటికూడ స్వార్థమనేది లేదు. కనుక, అట్టి ఈశ్వరత్వమైన దివ్యత్వాన్ని లోకానికి అందించే నిమిత్తమై యీ సంక్రాంతి అనేక విధములైన అర్థములు కూర్చుకొని వచ్చింది. ఆదిశంకరులుకూడను యీ సంక్రాంతిదినమే సన్యాసము స్వీకరించాడు. ఈ సంక్రాంతి దినము మనం సహజంగా బెల్లము, నువ్వులు కలిపి అందరికి ప్రసాదముగా అందిస్తూ వుంటాము. ఈ బెల్లమునకు వుండిన అంతరార్థము ఏమిటి? యిది తీపి. ఈ తీపే మన ప్రేమ. ఇక నువ్వులు. దీనికి స్నేహమని అర్థము. కనుక, ప్రేమతో కూడిన స్నేహాన్ని మనము అందరికి అందించాలి. అందరిని చేర్చుకోవాలి. అయితే, మన

sri sathyasai vachanamrutam

స్నేహము ఎలాంటిదిగా వుంటున్నాది యీనాడు లోకములో?

తండ్రి మంచి ఉద్యోగములో వుంటాడు. మన జేబులో దండిగా డబ్బు వుంటుంది. ప్రయాణము చేయటానికి అనేక సౌకర్యాలంతా వుంటాయి. మంచి యువకుడిగా వుండినప్పుడు యిలాంటి పరిస్థితుల ప్రభావము పురస్కరించుకొని అందరుకూడను 'హలో,' 'హలో' అని ప్రేమగా స్నేహితుడౌతూ వుంటారు. తండ్రి రిటైర్ అయిపోయినాడు. జేబు ఖాళీ అయింది. కార్లు, మోటారు సైకిలు నిల్చిపోయినాయి. అప్పుడు ఈ స్నేహము ఎక్కడ వుంటుండాది? చూస్తే గుడ్‌బైకూడా చెప్పడు. ఇదికాదు స్నేహము. హృదయపూర్వకమైన ప్రేమతో కూడినది స్నేహముగా వుంటుండాది. ఇది అన్ని సమయములందు నిలకడగా ఉంటుండాలి. చెరువులో నీరు నిండినంతవరకు వేలకొద్ది కప్పలు చేరుతూ వుంటాయి. చెరువులో నీరు ఎండిపోయిన, ఒక్క కప్ప అక్కడ చేరదు. ఆధునిక స్నేహములు ఈ విధంగా ఉంటాయి. యిదికాదు, నిజమైన స్నేహము. ఎన్ని విధములైన సమస్యలు, కష్టములు, దుఃఖములు సంప్రాప్తమైనప్పటికి స్నేహాన్ని మాత్రం వదలుకోకూడదు. అట్టి శాశ్వతమైన స్నేహితుడు ఒక్క భగవంతుడు మాత్రమే! God is always with you, in you, around you, above you, below you. అదే నిజమైన దైవం. కానీ, దురదృష్టవశాత్తూ యిట్టి స్నేహము నిమిత్తమై ఎవ్వరుకూడను ప్రయత్నించటంలేదు.

**దృశ్యకల్పితమైనవన్నీ యేనాడైనా అదృశ్యమయ్యేవే!**

భౌతికమైన, అనిత్యము, అశాశ్వతము, అసత్యమైన యీ జగత్తునందు అనిత్యమైన ప్రేమనే మనము ప్రకటితము చేస్తున్నాము. బాహ్యమైనవి యేమాత్రము భద్రమైనవి కాదు. దీనిని పురస్కరించుకునియే 'యద్దృశ్యం తన్నశ్యం' అన్నారు. దృశ్యకల్పితమైనవి అన్నీకూడను యేనాడైనా అదృశ్యమయ్యేవే! ఈ భౌతిక జగత్తుకు గోపికలు యిచ్చిన ఆనందమునే 'గొబ్బిళ్లు' అనే సాంప్రదాయముతో మనము యీనాడు అనుభవిస్తున్నాము. గొబ్బిళ్లు అనేవి గోపికలనుంచి వచ్చినవి. ఈ సంక్రాంతి దినము కుటుంబములో వున్న అక్కచెల్లెండ్రు, అన్నదమ్ములు ఎంతో ప్రేమ, స్నేహములతో ఉంటూ యితరులకుకూడా యీ స్నేహమును పంచే దినము. అందువలననే పూర్వము రోజుల్లో దానికి తగిన కొన్ని

sri sathyasai vachanamrutam

సన్నివేశాలుకూడను కల్పించి తమ ప్రేమ ప్రభావములు ప్రకటితము గావించేవారు. అందుకోసమే ఈ పండుగనాడు గంగిరెద్దువారు గంగిరెద్దులకు బాగా అలంకరించి యింటి, యింటికి మేళములతో తీసుకుని పోతూవుంటారు. నాలుగురోడ్ల కూడలిలో యీ గోవును నిలబెట్టి వాటితో అనేక రకములైన నాటకములుకూడను ఆడిస్తూ వుంటారు. యింటిలో ఉండిన అక్కచెల్లెళ్లు తమ్ములను తీసుకొని

**'తమ్ముడా రమ్ము గంగిరెద్దు దాసుడదుగో'**

అని చూపిస్తుంటారు. ఆ గంగిరెద్దు దాసు ఎట్లా వుంటాడు?

**"వెండి బిళ్లయు మొలత్రాడు దండకడెము**
**ముక్కునందు పైడి కాడయు మోమున పంగనామములు**
**వెంట గంగిరెద్దు**
**చేత ములికోల తన పేరు చెప్పుచుండు"**

ఒక ఆవునుగాని ఎద్దును కానీ ఆడించాలంటే దానికి కొన్ని అభ్యాసములు చేసివుంటారు. ములికొాల అని ముల్లు కఱ్ఱతో దీనికి తగిన శిక్షణ యిచ్చి వుంటారు. అంతేకాదు, అనేక అంతరార్థములతోకూడిన ఆటలుకూడను అక్కడ ఆడిస్తూ వుంటారు.

**"శ్రీరాములకు సీతమ్మనిచ్చి పెండ్లి గావించుచున్న ఆ**
**వేడ్క జూచి కానుకలనిచ్చి వత్తము కదలి రమ్ము"**

అన్నారు. శ్రీరాముడు ఎవరు? సీత ఎవరు? శ్రీరాముడే పరమాత్ముడు. సీతయే ప్రకృతి. ఈ ప్రకృతియొక్క బిడ్డ కనుక ఆమెకు "సీత, భూజాత", అని పేరు పెట్టారు. ఈ యిరువురిని ఏకత్వము గావించే పండగే సంక్రాంతి పండుగ. 'కానుకలనిచ్చి వత్తము కదలిరమ్ము'. వీరికి మనమిచ్చే కానుకలు ఏమిటి? మనయొక్క ప్రేమభావములే కానుక. దివ్యమైన సంకల్పములే కానుక. యిలాంటివి యిచ్చి ఆ ఐక్యతను చూచి వత్తము రమ్ము అని ఇది ఒక పిలుపు. యిది కుటుంబమునకు ఒక ఆదర్శమైన అనుభూతిగా అందిస్తూ వచ్చింది, సంక్రాంతి.

sri sathyasai vachanamrutam

**"అన్ని పండుగలకన్న ముఖ్యమిదిగాన**
**అత్తవారింటికేగుమో కొత్త పెండ్లి కొడుక!"**

కుటుంబములోపల చాలాకాలము దూరముగా వుంటాం, క్రొత్త అల్లుళ్ళతో సహా కుటుంబసభ్యులంతా సంవత్సరమునకు ఒక పర్యాయము సంతోషంగా కలసి ఉండే పద్ధతిగా దీన్ని ఏర్పరుచుకున్నారు. అల్లుడు యింటికి వస్తే వూర్లోవారు, యింట్లోవారు, మామాఅత్తలుకూడను ఎంతో ఆనందంగా అతనిని ఆదరించేవారు. ఆనాడు భార్య చెల్లెలు అనేక రకములుగా క్రొత్తగా పెండ్లైన బావను తమాషాలాడించేదట!

**"ముద్దు మరదలు నీతోట ముచ్చటాడు**
**వదినె నీతోడ మాటికి వరుసలాడు**
**ఊరివారు అతిగారాబమున మన్ననలు సల్పుదురు**
**నీదు మామకూడ అడుగులకు మడుగులొత్తు**
**అత్తవారింటికేగి రావయ్య నీవు"**

అని తల్లితండ్రులతనిని పంపించేవారట! అనగా కుటుంబముయొక్క ఐక్యతను, జీవబ్రహ్మ ఐక్యానుసంధానమును, దివ్యమైన, భవ్యమైన, నవ్యమైన, ప్రాకృతమైన, సంబంధమును, కర్తవ్యరీతిగా మనము ఆచరించాలనే క్రియాబాధ్యతను, కార్యశూర్యునిగా మీరు తయారుకావాలని సూర్యునియొక్క ప్రబోధలు, కర్మనిష్ఠయే మానవునియొక్క ధర్మనిష్ఠ అని ప్రబోధించే యీ దివ్యత్వాన్ని యింతటి పవిత్రతను అందించేదే యీ సంక్రాంతి.

అలాంటి సంక్రాంతిని నేడు కేవలము నువ్వులు, బెల్లము కలిసిన ప్రసాదముతోనే సరిపెట్టుకుని అంతరార్థమును గుర్తించుకొనలేక, పొంగలి చేసుకుని కడుపునిండుగా మెక్కి యిదే సంక్రాంతి అని మురిసిపోతూ ఒక క్రాంతి లేకుండా అంధకారములో మునిగిపోతున్నారు, మానవులు. ఈ పొంగలి ఎందుకోసం చేశారు? ఎప్పుడైనా చేసుకోవచ్చుకదా! యీ పండుగకు మాత్రమే పొంగలి ఎందుకు చేసుకోవాలి? ఆనాడు పంటలు ఎంతో సమృద్ధిగా వుండేవి. కనుక పొంగలి వండి దానిని పశువులకు అందించి, ఆ ప్రసాదమును పంటలందంతా జల్లేవారు. మూడవదినము పశువులకంతా అలంకారము

sri sathyasai vachanamrutam

చేసి బజారులలో ఊరేగింపు గావించి గ్రామస్థులు అందరితో తమ ఆనందమును పంచుకునేవారు. దీనిని 'మాట్టు పొంగల్' అని తమిళ్‌లో చెప్పేవారు. అనగా పశువుల పండుగ. పశువు అనగా ఏమిటి? పశుత్వమనగా కేవలము మూర్ఖత్వమని అంటున్నారు. కాదు, కాదు; పశుపతివైపున తిప్పే దృష్టికే 'పశువు' అని పేరు పెట్టారు. అనగా నంది వుంటుండాది. నందియొక్క దృష్టి ఎక్కడ వుంటుండాది? ఈశ్వరునిపైపే వుంటున్నాది. ప్రకృతివైపున లేదు. యిది పశువైనా పరమేశ్వర స్వరూపకంగా భావిస్తూ మొట్టమొదట నందికి నమస్కరించి తరువాత ఈశ్వరునికి నమస్కరిస్తారు.

**పశు, పక్షి, మృగాదులకున్న త్యాగభావము మానవులకు లేకపోతున్నది**

హనుమంతుడు, వానరుడు. వానరుడైనప్పటికి భగవంతుని చింత తప్ప అన్యచింత అతనియందు లేదు. ఆనాటి వానరుడు దైవత్వానికి సన్నిహిత సంబంధమును కల్గించుకొనుచుండగా యీనాటి మానవుడు భగవంతునకు అత్యంత దూరమైపోతున్నాడు. పశుపక్షిమృగాదులుకూడను మానవునికి అనేక ప్రబోధలు చేస్తున్నాయి. అందరికి తెలుసు. పక్షులు గ్రుడ్లుపెట్టి వాటిని పొదిగి పిల్లలను చేస్తున్నాయి. కాని ఆ పిల్లలకు రెక్కలు వచ్చేంతవరకుమాత్రమే తల్లితండ్రులు పోషిస్తూ వుంటాయి. రెక్కలు వచ్చిన తరువాత వాటిని వదలి పెడతాయి. 'యింక నీ స్వాతంత్ర్యముపైన నీవు బ్రతుకు. యింతవరకే మా బాధ్యత. నీవు ఎక్కడికైనా ఎగరటానికి శక్తి వచ్చింది. కనుక, నీ స్వశక్తిపైన ఆధారపడివుండు. మాపై నీవు ఆధారపడకూడదు,' అని పక్షులు తమ బిడ్డలకు బోధించి స్వతంత్రముగా వదలిపెడుతున్నాయి. పశువులు తమకు పుట్టిన బిడ్డను స్వశక్తి వచ్చేంతవరకు పాలిచ్చి అనేక విధములుగా పోషిస్తాయి. తమ స్వశక్తిని తాము గుర్తించిన తరువాత 'నీ తిండి నీవు సంపాయించుకో, నీ కర్తవ్యమును నీవు నిర్వర్తించుకో'మని వదలివెడతాయి. కానీ, యీనాటి మానవుడు యింకా సంపాయించి, పెద్దవాడయ్యేంతవరకుకూడా సంపాదించి పెడుతూ "ఒరే బాబూ! నా దగ్గరనే వుండూ, నేను నీదగ్గరే వుంటాను" అంటూ ఒకరికొకరు ఎడబాటు అనేది లేకుండా చూచుకుంటున్నారు. మానవుడై పుట్టి సుజ్ఞాన విజ్ఞానములుండినప్పటికిని త్యాగభావము

sri sathyasai vachanamrutam

మానవునిలో రాలేకపోతున్నాది. ఎంత వయస్సు వచ్చినప్పటికి యింకా ఎటాచ్‌మెంటు, కలుసుకోటం. యీ బంధనలచేత స్వయంగా బంధితుడౌతున్నాడు. ఎంతకాలమైనప్పటికి యిల్లుని కాపలాకాచుకుంటూ కూర్చుంటున్నారు. బిడ్డలు ఎంత హీనముగా చూచినప్పటికి వీడు యీ బంధన వీడటంలేదు. యిదేనా మానవత్వము? పశుపక్షిమృగాదులకున్న త్యాగము మానవునకు లేకపోతున్నాదే! ఎంతకాలము యీ కర్తవ్యము? ఎక్కడవుండినా వారి క్షేమాన్ని నీవు ఆశించుకానీ, వారి స్వశక్తిపైన వారిని వదలి పెట్టాలి. అదే 'ఫ్రీడమ్' అన్నారు. 'ఫ్రీడమ్' అనగా యిష్టము వచ్చినట్లు బజార్లు చుట్టమనికాదు. యిష్టము వచ్చినట్లు ఖర్చులు పెట్టమని కాదు. మానవునిగా ప్రవర్తించు. తల్లితండ్రుల గౌరవమును కాపాడు. యింటి గౌరవమును బెట్టు. ఈ మూడింటిని లక్ష్యములో పెట్టుకొని నీవు ఏ స్వతంత్రముగానైనా పో!

**మానవత్వమునుండి దివ్యత్వమునకు చేరే మార్గమును ప్రబోధించేదే సంక్రాంతి**

The end of wisdom is freedom అన్నారు. ఈనాడు పిల్లలుకూడను అట్లే, మాకు స్వాతంత్ర్యము కావాలి అంటారు. ఏమిటి యీ స్వాతంత్ర్యము? యిష్టము వచ్చినట్లు రాత్రింబవలు తిరగటమా స్వాతంత్ర్యము? కాదు, కాదు. ఆత్మజ్ఞానము, ఆత్మానందము, ఆత్మనిగ్రహము, ఆత్మతృప్తి యిదే స్వాతంత్ర్యము. యీ స్వాతంత్ర్యముయొక్క అర్థాన్ని గుర్తించుకొనలేక మనసుకు నచ్చినట్లుగా ప్రవర్తించి మానవత్వమును విస్మరించి కేవలము వానరత్వాన్నే పెంచుకుంటున్నారు. ఈ సంక్రాంతి అనేది మానవత్వమునుండి దైవత్వానికి చేరేటువంటి మార్గాన్ని ప్రబోధిస్తూ వస్తున్నాది. చెఱకువుంది. ఈ చెఱకుయొక్క స్వరూపము అనేక వంపులుగా వుంటుంది. ఈ చెఱకులో అనేక కణుపులంతా వుంటుంటాయి కానీ, అందులో వుండిన తీపికి ఏట్టి మార్పు వుండదు. జీవితమనేది ఒక చెఱకుగడ. అనేక కష్టములు, నష్టములు, దుఃఖములు, విచారములు యిలాంటి కొన్ని విధములైన మార్పులు కలుగవచ్చును. ఎన్ని మార్పులు కలిగినప్పటకినీ నీ దివ్యత్వమనే దానిలోపల మార్పు ఉండకూడదు. ఏకత్వముగానే వుంటుండాలి. జీవితములో అనేక కష్టములు, నష్టములు కలిగినప్పుడే అది దివ్యమైన, శాశ్వతమైన ఆనందమునందిస్తుంది.

**పిలచి అడుగ చెఱకు పెట్టునా బెల్లము**

sri sathyasaivachanamrutam

## పిప్పిగొట్టి రసము పీల్చుకున్న!

మధురమైన రసము కల్గిన చెఱకునైనాకూడను మనము ఒక ప్రదేశములో పెట్టి 'ఓ చెఱుకా! నీయందు మాధుర్యము వుంటున్నాది, నాకు దానిని అందించు' అని నమస్కరిస్తూ వేడుకుంటూంటే ఫలితము ఉండదు. నాలుగు దినములకు ఆ మాధుర్యముకూడను మాయమై పోతుంది. రసము ఎండిపోతుంది. ఆ మాధుర్యమును మనము అనుభవించవలెనన్న దానిని చక్కగా మిషన్‌లో వేసి పిప్పిచేసి ఆ రసమును తిరిగి అగ్నిలో వేసి దానిని చక్కగా కాల్చి బెల్లముగా చేసినప్పుడే అది శాశ్వతమైన మధురపదార్థముగా నిల్చిపోతుంది. ఈ శాశ్వతమైన స్థానము చెందవలెనంటే ఈ చెఱకు ఎన్ని కష్టాలకు గురి కావాలి! ఈ కష్టాలను తాను సహించి భరించుకున్నప్పుడే, తట్టుకొని, నెట్టుకొని వచ్చినప్పుడే, శాశ్వతమైన స్థానము లభ్యమవుతుంది.

## ఆత్మవిశ్వాసము లేనివాడు ఎండుటాకువలె ఎగిరిపోతుంటాడు

ఒక బంగారు ముద్దను చేతిలో పెట్టుకుంటే ఏమీ భద్రతలేదు. అందమూ లేదు, ఆనందము లేదు. కానీ, వెల వున్నది. ఆ వెలవుండి ప్రయోజనం ఏమిటి? మనకు ఆనందం రావాలంటే దానిని ముక్కలుగా కొట్టి, నిప్పులో వేసి కరగించి, సుత్తితో కొట్టి, దానిని చెక్కిన తరువాతనే అది చక్కని నగగా తయారై మెడలో పెట్టుకొని ఆనందించవచ్చును. యీ కష్టములు, నష్టములు, దుఃఖములే అందించకుండిన అది చక్కని నగగా తయారుకాలేదు. ప్రతి మానవుడుకూడను బంగారువంటివాడే! అందుకోసమే నేను అందరిని "బంగారు! బంగారు!' అంటూ వుంటాను. అనగా, నీవు చాలా విలువైనవాడవే! కానీ కొన్ని కష్టాలు, దుఃఖాలు విచారములు కొంతవరకు శాంతంగా భరించుకోవాలి. అంతేగానీ కష్టములు, నష్టములు, దుఃఖములు వచ్చినాయని మనసును మార్చుకోరాదు. నిన్న చెప్పాను. ఉక్కుగుండు, ఎండుటాకు. రెండూ ఒకచోట పెట్టినప్పుడు గాలి లేకపోతే రెండూ నిశ్చలంగానే వుంటాయి. కానీ, మలయమారుతము వచ్చిందా ఎండుటాకు ఏడుమైళ్లు పరుగెడుతుంది. ఉక్కుగుండు మాత్రం అక్కడే వుంటుంది. కనుక, ప్రాకృతమైన కష్టములను, దుఃఖములను భరించుకున్నప్పుడే, సహించుకున్నప్పుడే, భగవంతునిపై విశ్వాసం

sri sathyasaivachanamrutam

పెంచుకున్నప్పుడే మనము ఉక్కుగుండువలె వుండవచ్చు. అట్టి ఆత్మవిశ్వాసం లేనివాడు ఎండుటాకువలె ఎగిరిపోతూవుంటాడు. కనుక, మొట్టమొదట ఆత్మవిశ్వాసమును పెంచుకోవాలి. యిట్టి ఆత్మవిశ్వాసమును పెంచుకొని, ప్రజాక్షేమాన్ని ఆశించి, లోకసేవను విశ్వసించి, మనము జగత్తులోపల సరైన కర్తవ్యమును నిర్వర్తించాలి. ఈ అహంకార, మమకారములను పూర్తిగా త్యజించాలి. మనము సూర్యుని అనుసరించాలి.

**దృష్టిని అంతర్ముఖమైన హిమాచలమునకు ప్రయాణము చేయించడమే సంక్రాంతి పండుగ అంతరార్థము**

ఈనాటినుండి సూర్యుడు ఉత్తరదిశకు ప్రయాణమవుతూ వుంటాడు. ఈనాడే ఉత్తరాయణము ప్రారంభమైంది. మహాజ్ఞాని, మహాత్యాగి, మహాదీక్షాపరుడైన భీష్ముడుకూడను ఉత్తరాయణ పవిత్రకాలమునందే తన ప్రాణము విడచాలని 56 దినములు శరతల్పముపైన పరుండినాడు. సూర్యుడు ఉత్తరదిశకు ప్రయాణమవుతున్నాడు. ఉత్తరదిశ అంటే ఏమిటి దీని అర్థము? హిమాలయ పర్వతము. హిమాలయమనగా ఏమిటి? ఈశ్వరునియొక్క నివాసము. ఏమిటి యీ హిమాచలము? హిమమనగా ఏమిటి? హిమము తెల్లగా వుంటుంది. దీనికి పవిత్రము అని ఒక అర్థము. దీని గుణము ఎట్లా వుంటుంది? చల్లదనము, ప్రశాంతి దీని గుణము. అచలమనగా ఏమిటి? స్థిరముగా వుండేది. చలనములేనిది. కనుక, యిది హిమాచలము. అనగా, నిర్మలంగా, ప్రశాంతముగా, నిశ్చలముగా వుండిన హృదయమే హిమాచలము. ఆ హిమాచలమునందే ఈశ్వరుడు వుంటున్నాడు. కనుకనే దృష్టిని బహిర్ముఖము కాకుండా అంతర్ముఖమనే హిమాచలమునకు ప్రయాణము చేయించు. హిమాచలమంటే ఎక్కడో ఋషికేశ్, హరిద్వారము మనం ప్రయాణము చేయనక్కరలేదు. మన నిర్మల, ప్రశాంత, నిశ్చల హృదయమే హిమాచలము. ఇట్టి అంతర్బోధను గావిస్తూ వున్నాడు, సూర్యుడు. యితనికి ఎట్టి అహంకారము లేదు. 'నేనే లేకుండిన యీ జగత్తు ఏ విధంగా సృష్టికాగలదు' అని సూర్యుడు ఏనాడూ అహంకరించలేదు. యితనియందున్న హైడ్రోజనువల్లనే పర్వతములు, వృక్షములు, అన్నీ ఆవిర్భవిస్తున్నాయి. సమస్తమైన పంటలు సూర్యరశ్మినుండే

sri sathyasai vachanamrutam

ఆవిర్భవిస్తున్నాయి. సమస్త జీవులుకూడను సూర్యునినుంచే ఆవిర్భవిస్తున్నాయి. యింత పని నేను చేస్తున్నానని ఎంత విఱ్ఱవీగాలి! కాని, సూర్యునికి యీ అహంకారమే లేదు. కనుకనే "నాయనా! నీవు గొప్పపని చేస్తున్నానని, పరోపకారము చేస్తున్నానని గర్వపడవద్దు. నన్ను నీవు అనుసరించు" అని ప్రబోధిస్తున్నాడు, సూర్యుడు. తాను నిర్విరామముగా పని చేస్తున్నాడు. ఒక్క దినము, అర్ధదినము అయినా సెలవు తీసుకుంటే ప్రపంచమంతా అంధకారములో మునిగిపోతుంది. ఒక్క గంటకూడా తాను సెలవు తీసుకోటంలేదు. సూర్యుడు నిరంతర కృషి గావించే కర్మశూరుడు, కర్మవీరుడు. దీనినే భగవద్గీతయందు కృష్ణుడు

**"నమే పార్థాస్తి కర్తవ్యం త్రిషులోకేషు కించన**
**నానవాప్త మవాప్తవ్యం వర్తయేవచ కర్మణి"**

అని చెప్పాడు. కర్మ చేసే తీరాలి. యిది కర్తవ్యం. యిది నాయొక్క కర్తవ్యం. భగవంతునికే కర్మాచరణ కర్తవ్యమైనప్పుడు మానవులు కర్మ చేయకుండా కర్మసన్యాసము పుచ్చుకుంటామంటే యిది కేవలం పిరికితనము, బలహీనత. కర్మసన్యాసముకంటే కర్మయోగమే ఉత్తమమైనది. "యోగః కర్మసు కౌశలం". అదే మనయొక్క యోగము. సన్మార్గములో యీ కర్మను ప్రవేశపెట్టాలి. సదుద్దేశముతో యీ కర్మలు చేపట్టాలి. సదానందమును అనుభవించాలి. యిలాంటిదే నిజమైన కర్మ. కేవలము నిరాశతో, నిస్పృహతో కర్మలాచరించరాదు. ఆనందముతో దీంట్లో ప్రవేశించాలి. అప్పుడే "కర్మణ్యేవ అధికారస్తే". నీవు కర్మాధికారివి అవుతావు. సంక్రాంతి ఎన్నియో విధములైన మార్పులను గావిస్తూ అంతర్బహిర్ మార్పులను చేకూరుస్తూ మానవత్వమును దివ్యత్వము వైపునకు నడిపించుచున్నది.

**శాంతి, క్రాంతి మన హృదయమునందే ఉంటున్నవి**

భగవంతుని గురించి 'అంతర్బహిశ్చతత్సర్వమ్ వ్యాప్య నారాయణస్థితః' అని వేదం చెపుతోంది. ఆయన లోపల, వెలుపల, అంతటా వుంటున్నాడు. అటువంటి సర్వవ్యాపియైన భగవంతుని అన్వేషించేది ఎక్కడ? అతను ఎక్కడ వున్నాడని పోయేది? ఎక్కడ చూచినా

sri sathyasai vachanamrutam

అంతటా వుంటున్నాడు. అందువలన వెతకనక్కరలేదు. నిన్ను నీవు చూచుకుంటే భగవంతుని చూచినవాడవౌతావు. సంక్రాంతి అనేది ఒక్క భారతీయులకు మాత్రమే కాదు, యావత్ ప్రపంచమునకు క్రాంతి నందించేది. అన్ని మతములకు, అన్ని దేశములకు, అన్ని రూపములకు యీ సంక్రాంతి మహాక్రాంతి నందించేటువంటిది. నిజమైన శాంతిని చేకూర్చేటువంటిది. శాంతి, క్రాంతి మన హృదయమునందే వుంటున్నవి. అందువలన ఆనందమును మనము బయట ప్రపంచములో వెతకటానికి పోకూడదు. ప్రాపంచికమైన ఆనందము శాశ్వతము కాదు. శాశ్వతానందము నీలోనే ఉన్నది. నిన్ను నీవు తెలుసుకోవటానికి ప్రయత్నించాలి. ప్రాకృతమైన కర్మలు మనము ఆచరించే తీరాలి. ఐతే అవి ఆచరిస్తూ కూడను అవి అంతరంగమునుండి ఆవిర్భవించిన దివ్యత్వముయొక్క కర్మలుగానే విశ్వసించాలి.

**దైవార్పితభావంతో కర్మలాచరించండి**

మానవుడు యవ్వనమునకు యేమాత్రము గర్వించరాదు. వార్ధక్యమునకు భయపడరాదు. మరణానికి దిగులొందరాదు. ఈ యవ్వనము, వార్ధక్యము, మరణము, దేహమునకేగానీ నీకు కాదు. అందులోనూ మానవుని యవ్వనము మరింత సులభంగా తీరిపోయేటువంటిది. కేవలము మధ్యలో వచ్చి మధ్యలో వూడి పోయేటువంటిదే! యిది కేవలము కదలిపోయే మేఘముల వంటిది. దీని నిమిత్తమై మనము అహంకారంగా విఱ్ఱవీగి మనయొక్క మానవత్వమును మసిగొల్పుకోరాదు. ఈ పవిత్రమైన, దివ్యమైన వయస్సును సార్థకం గావించుకోవాలి. తోటి మానవులకు సేవ చెయ్యండి. తల్లితండ్రులకు ఆనందాన్ని అందించండి. దైవ భావముతో మీ జీవితమును నడపండి. దైవార్పిత భావముతో మీరు కర్మలాచరించండి. 'సర్వకర్మభగవత్ప్రీత్యర్థం' అనే దృష్టితో మీరు ఆచరించాలి. అట్టి భావమే లేక ఎన్ని కర్మలు ఆచరించినప్పటికిని కేవలము కీ యిచ్చిన గడియారము తిరిగినట్లుగా artificial life గా గడచిపోతుంది. దేన్ని చేసినా మనస్ఫూర్తిగా చేయండి. పవిత్రమైన భావముతో చేయండి. నిష్కామమైన చింతతో మీరు చేయండి. అప్పుడే నిశ్చలము, ప్రశాంతి, పవిత్రత మనలో అభివృద్ధి గాంచుతాయి. ఉన్నది ఒకే దేవుడే. అందరియందు

srisathyasaivachanamrutam

వున్న ఆత్మతత్త్వము ఒక్కటే. ఏ మతమును ద్వేషించకూడదు. ఏ వ్యక్తులను మీరు యేమాత్రం కించపరచకూడదు. అన్ని మతముల సారమే, అన్ని మార్గముల గమ్యమే, అన్ని పనులయొక్క కీలకమే, ఆత్మతత్త్వము. అట్టి ఆత్మతత్త్వముతో మీరు భగవంతుని సన్నిధిని, పెన్నిధిని అనుభవించండి. ఈ అన్నింటికి ప్రేమయే ప్రధానము, ప్రేమయే దైవము, ప్రేమయే మన సర్వస్వము.

**(తేదీ 15-01-1992న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam